# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 307 శుక్రవారం, జులై 4, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam


# హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

- మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్
- వందేళ్ల లక్ష్యంతో 'విజన్-2047' ప్రణాళికను రచిస్తున్నామన్న ప్రభుత్వం
- పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ
- తయారీ రంగంలో 9 శాతానికి పైగా వృద్ధి సాధించామన్న మంత్రి శ్రీధర్ బాబు
- 15 రోజుల్లోనే పరిశ్రమల అనుమతులు మంజూరు చేస్తున్నామని వెల్లడి

**తెలంగాణ రాజధాని హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామని స్పష్టం చేశారు.**



**హైదరాబాద్** హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్క్‌లో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్ ను సీఎం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ పారిశ్రామిక విస్తరణలో మరో మైలురాయిగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగానికి పెట్టుబడులను ప్రోత్సహిస్తూ చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' అనే విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇది తెలంగాణఏ100 దృష్టిలో ఉన్న వ్యూహాత్మక ప్రణాళికగా పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ తరాల కోసం నిర్మితమవుతున్న గ్లోబల్ వేదిక అని కితాబిచ్చారు.తెలంగాణపై నమ్మకంతో భారీ పెట్టుబడులు పెట్టిన మలబార్ గ్రూప్‌కి సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. "మహేశ్వరంలో జ్యువెలరీ తయారీ యూనిట్‌ను

వార్త 2లో

500 శాతం సుంకాలు విధిస్తామని

# అమెరికా బెదిరింపులు

- అమెరికా కాంగ్రెస్‌లో సుంకాల పెంపు బిల్లు
- రష్యా ఆయిల్ దిగుమతి దేశాలకు వార్నింగ్ - తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ** ఆంక్షలు కొనసాగుతున్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామనే అమెరికా బెదిరింపులపై భారత విదేశాంగా శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. వాషింగ్టన్ డీసీలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా విధించబోయే 500 శాతం దిగుమతి సుంకాలపై ఆందోళనలను వ్యక్తం చేశారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు లిండ్సే గ్రాహమ్ ప్రవేశపెట్టిన కొత్త బిల్లును దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన బిల్లు అమెరికా కాంగ్రెస్ చర్య అయితే అది భారత ప్రయోజనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మేం దానిని గమనించాల్సిందే" అని జైశంకర్ పేర్కొన్నారు. "ఇంధన భద్రతల విషయంలో భారత్‌కు ఉన్న ప్రయోజనాలను మేము ఆయనకు (గ్రాహమ్) స్పష్టంగా వివరించాం ఈ సమస్య ఎదురైనప్పుడు తగిన విధంగా స్పందిస్తాం" అని ఆయన అన్నారు. అమెరికా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఇటీవల ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "రష్యా నుంచి ఉత్పత్తులు కొంటూ ఉక్రెయిన్‌కు సహాయం చేయకుంటే

వార్త 2లో

నన్ను డమ్మీ అన్నవాళ్లకు

# డాడీ అవుతా

- తెలంగాణ బీజేపీ చీఫ్ వార్నింగ్



**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది కిరీటం కాదని అదొక బాధ్యత అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల మీద దృష్టి సారించామని వీలైనన్నీ ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రాజాసింగ్ అంశాన్ని జాతీయ అధినాయకత్వమే చూసుకుంటుందని రాంచందర్ రావు తెలిపారు. తాను డమ్మీ లీడర్‌నా, కాదా? అనేది త్వరలో చూపిస్తానని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తనను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా అంటూ ఆయన హెచ్చరించారు. మొత్తం తెలంగాణలో తన కంటే ఫైర్ బ్రాండ్ ఎవరూ లేరని స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. తన పొలిటికల్ లైఫ్‌లో ఇప్పటివరకు 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చానని, లాఠీ దెబ్బలు తిన్నానని మావోయిస్టులతో పోరాటం చేశానని ఆయన గుర్తు చేశారు. అందరినీ

వార్త 2లో

# భారత రక్షణ రంగం

బలోపేతం దిశగా కీలక ముందడుగు

- రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డీఏసీ సమావేశం



**న్యూఢిల్లీ** భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది. సుమారు రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు, ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ మంత్రి రాజ్?నాథ్ సింగ్ అధ్యక్షతన ఉన్న రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) గురువారం ఆమోదం తెలిపింది. ఈ కొనుగోళ్లన్నీ పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే చేపట్టనుండటం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పెద్ద ఊతంగా నిలవనుంది. ఈ సమావేశంలో త్రివిధ దళాల అవసరాల కోసం క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు (ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్), ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఇంటిగ్రేటెడ్ కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి 10 కీలక ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' లభించింది. వీటితో పాటు నౌకాదళం కోసం మైన్ కౌంటర్ మెజర్ వెస్సెల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ వంటి అత్యాధునిక పరికరాలను కూడా సేకరించనున్నారు. ఈ కొత్త ఆయుధాలు, వ్యవస్థల చేరికతో త్రివిధ దళాల కార్యాచరణ సామర్థ్యం మరింత పటిష్ఠం కానుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదస్సులో మాట్లాడిన రాజ్?నాథ్ సింగ్, దేశీయ రక్షణ ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని తెలిపారు. "పదేళ్ల క్రితం కేవలం రూ. 43,000 కోట్లుగా

వార్త 2లో

## సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కేసీఆర్ కు చికిత్స

- అత్యుత్తమ చికిత్స అందించాలని సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కేసీఆర్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వైద్యులు, అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని ఆయన ఆదేశించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం స్వల్ప అనారోగ్యంతో కేసీఆర్ యశోద ఆసుపత్రిలో చేరగా, వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తాను అడిగి తెలుసుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు బండి సంజయ్ పేర్కొన్నారు. అనారోగ్యం నుంచి బయటపడి, ఆయన వీలైనంత త్వరగా తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తన సందేశంలో వెల్లడించారు.

నిర్లక్ష్యానికి తప్పదు

# భారీ మూల్యం

## - సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాంట్రాక్టర్
- బీమా పరిహారం కోసం బాధితుడి ఫ్యామిలీ పిటిషన్
- నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణిస్తే బీమా చెల్లించక్కర్లేదు
- కర్ణాటక హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ** నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ బీమా పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ప్రమాదంలో మరణించిన వ్యక్తికి రూ.80 లక్షలు చెల్లించాలంటూ బీమా కంపెనీపై దాఖలైన పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళ్తే జూన్ 2014లో కర్ణాటకకు చెందిన రవీష్ అనే కాంట్రాక్టర్, అతి వేగంగా, నిర్లక్ష్యంతో కారు నడిపి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో బీమా కోసం అతడి కుటుంబం ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించి బీమా చెల్లించాలని కోరింది. రవీష్ నెలకు రూ.3 లక్షలు సంపాదించేవాడని, కానీ అతడు మరణంతో కుటుంబం ఆర్థికంగా నష్టపోయిందని, తమకు రూ.80 లక్షలు బీమా చెల్లించాలని

వార్త 2లో

# కాంగ్రెస్‌లో కోవర్టులు

- మీనాక్షి నటరాజన్‌తో కొండా దంపతుల భేటీ



**హైదరాబాద్** వరంగల్ రాజకీయాలు అనేక మలుపులు తిరుగుతున్నాయి. కొండా దంపతులకు వ్యతిరేకంగా ఏకమైన జిల్లా కాంగ్రెస్ నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. కొండా సురేఖ, మురళిపై చర్యలకు డిమాండ్ చేశారు. ఇంతలో కొండా దంపతులు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సమావేశమయ్యారు. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం ఏం ఆలోచిస్తోంది ఎలాంటి పరిణామాలు జరగనున్నాయనే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ సమావేశం తర్వాత కూడా కొండా మురళి తగ్గేదేలే అన్నట్టు మాట్లాడాటం మరింత క్యూరియాసిటీని కలిగిస్తోంది. కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సమావేశం అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో పార్టీలో బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారని ఆరోపించారు. కొందరు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారన ఆరోపించారు. తాను చేసిన ఆరోపణలపై మీనాక్షి నటరాజ్‌ను 16 పేజీల లేఖను ఇచ్చారు. ఇందులో వివాదాలు, తనపై వచ్చిన ఫిర్యాదులపై కూడా ఆ లేఖలో వివరణ ఇచ్చారు. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలీసులతో అనుచరులను వేధిస్తున్నారని తెలిపారు. మంత్రికి సంబంధం లేకుండా ఆలయ కమిటీలు వేస్తున్నారని, మంత్రికి తెలియకుండా పోస్టింగ్‌లు ఇస్తున్నారని వివరించారు.పని చేసే వాళ్లపైనే రాళ్లు వేస్తున్నారని

వార్త 2లో

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల

# మంజూరు పత్రాలు పంపిణీ

నారాయణపేట,: నారాయణపేట నియోజకవర్గం పరిధిలోని కోయిలకొండ మండలం గురువారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 11: 00 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు సంబంధిచిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ పంపిణీ చేస్తారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు.

## కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటన

కల్వకుర్తి, : కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం 12: 00 గంటలకు బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఎమ్మెల్యే పర్యటన కోసం అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

అచ్చంపేట, : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్ల భావిలో నూతనంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు మద్దెల దివాకర్, దాసరి అంబ నారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

# జన్మదిన వేడుకలు



కోదాడ, : కోదాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి నివాసంలోఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలో టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవేటి రామారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆవుదొడ్డి ధన మూర్తి, వంటిపులి వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు, ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# కల్తీ పాలు తయారు.. వ్యక్తి అరెస్ట్

భువనగిరి, : యాదాద్రి భువనగిరి జిల్లా భూధాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలో కల్తీ పాలు తయారు చేస్తున్న వ్యక్తిని ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 100 లీటర్ల కల్తీ పాలు, 240 లీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 7 కేజీల దూల్పుర్ స్కీం మిల్క్ పౌడర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. రిమాండ్ కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గీత కార్మికులకు కొత్త లైసెన్సులు ఇప్పించేందుకు కృషి

సూర్యాపేట, : కోదాడ నియోజకవర్గంలో అర్హులైన గీత కార్మికులకు కొత్త లైసెన్సులు, ఐడి కార్డులు మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్ పద్మావతి సహాయ సహకారాలతో అందరికీ ఇప్పించేందుకు కృషి చేస్తానని గౌడ సంఘం రాష్ట్ర నాయకులు ప్రముఖ న్యాయవాది కే ఎల్ ఎన్ ప్రసాద్ అన్నారు. గురువారం కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన గీత కార్మికులు కే ఎల్ ఎన్ ప్రసాద్ కలిసి పెండింగ్‌లో ఉన్న లైసెన్సులు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

## డ్రైనేజీ పనులను పరిశీలించిన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్



బాన్సువాడ,: బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ హరి రాజుతో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు. డ్రైనేజీలో చెత్త చెదారం పేరుకుపోయిందని, నీరు రోడ్ల మీద ప్రవహించకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఖలేఖ్, నార్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి సీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డి, : ఎల్లారెడ్డి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ డాక్టర్. హరికిషన్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసామని, అవసరం మేరకు చూపు మందగించిన వ్యక్తులకు కంటి అద్దాలు వాడాలన్నారు. ఆకుకూరలు, పోషక పదార్థాలు భోజనంలో తీసుకుంటే కంటి చూపులో ఇబ్బందులు రావన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం

బాన్సువాడ, : కామారెడ్డి జిల్లా పెద్దకొడపల్ మండలంలో రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు బైక్ పై తమ గ్రామానికి వెళ్తుండగా జగన్నాథపల్లి గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. దీంతో ఇద్దరు స్పాట్‌లోనే మృతి చెందారు. కాగా మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రియురాలితో గొడవపడి న్యాయవాది ఆత్మహత్య

ఉప్పల్, : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ టీచర్స్ కాలనీకి చెందిన కల్లూరి సాయినాథ్ (30) ఉప్పల్ సూర్యానగర్ కాలనీలో ఉంటూ రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నాడు. అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతిని కాదని మరొకరిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమవడంతో అతడి ప్రియురాలు సాయినాథ్ ఇంటికి వచ్చి గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురైన సాయినాథ్ స్నేహితుల ఇంటికి వెళ్లి ఒంటరిగా ఉన్నప్పుడు గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఇంటికి వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన ఎస్సై

సనత్‌నగర్, జులై 3(ఎ.ఎం.ఎస్): రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్ నగర్ ఎస్సై రాజేశ్వర్ గౌడ్ మృతి చెందారు. అర్ధరాత్రి బల్కంపేటలో బందోబస్తు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో ఆయన కారు లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. రాజేశ్వర్ స్వస్థలం సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ. ఈ ప్రమాదంలో రాజేశ్వర్ గౌడ్ మృతి చెందడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



ఉప్పల్, జులై 3(ఎ.ఎం.ఎస్): నాచారాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం 70 లక్షల రూపాయల నిధులతో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌తో కలిసి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో అంతర్జాతీయ మెకానిక్ డే వేడుకలు

అమీర్‌పేట,: అంతర్జాతీయ మెకానిక్ డే సందర్భంగా కూకట్‌పల్లి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మెకానిక్‌లు తమ వృత్తి ప్రాముఖ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్, జనరల్ సెక్రటరీ శ్రీశైలం, కోశాధికారి శ్రీనివాస్, కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, బాలాజీ నగర్, సుమిత్రా నగర్ పరిసర ప్రాంతాల మెకానిక్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సనత్ నగర్‌లో రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు దగ్ధం

కుత్బుల్లాపూర్, హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో పెను అగ్నిప్రమాదం తృటిలో తప్పింది. సనత్‌నగర్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో గురువారం ఉదయం ఫ్రిజ్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. వెంటనే మంటలు వ్యాపించి ఇంట్లోని ఫర్నిచర్, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లడంతో పెను ముప్పు తప్పింది.

## పీర్లకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

కోరుట్ల, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ దర్వాజా అసురా?నాలో ప్రతిష్ఠించిన పీరిలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పాల్గొని పూజలు చేసి, ఆధ్యాత్మికతను పంచుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.

## చట్ట ప్రకారం నిబంధనలు

# పాటించకపోతే చర్యలు తప్పవు

### తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్




**తూప్రాన్, జూలై 03,ప్రజాస్వరం:** చట్ట ప్రకారం నిబంధనలు పాటించకపోతే ప్రతి ఒక్కరి పై కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ అన్నారు. గురువారం తూప్రాన్ డివిజన్ పరిధిలో ఉన్న దాబాలు, రెస్టారెంట్లు, బార్ల ఓనర్లతో తూప్రాన్ లోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ...దాబాల్లో, రెస్టారెంట్లల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరపవద్దన్నారు. దాబాలు, హెూటళ్ళు రాత్రి ఎక్కవ సమయం వరకు తెరిచి ఉండటం వలన నేరాలు ఎక్కవగా జరిగే ప్రమాదం ఉందన్నారు. డివిజన్ పరిదిలోని దాబా హెూటళ్ళు, రెస్టారెంట్లు రాత్రి 12 గంటల లోపు మూసివేయాలన్నారు. హెూటళ్ళ వద్ద ఎవరైనా ఎక్కువ రోజులుగా ఉండిపోతే దాబాల్లో ఎవరైన వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకి సమాచారం అందించాలన్నారు. ప్రతి దాబాలు, హెూటళ్ళ లో క్వాలిటి ఉన్న సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. హెూటల్ కు వచ్చిన ప్రతి కస్టమర్ కు కల్తీలేని మంచి నాణ్యత కలిగిన భోజనం అందించాలన్నారు.రాత్రి సమయాల్లో ధాబాల వద్ద ఎక్కవగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని అలాంటి సమాచారం ఉంటే పోలిసులకి తెలియజేయాలన్నారు. ప్రతి ధాబాల్లో,హెూటళ్ళలో మద్యం సిట్లింగ్ చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఎవరైన కస్టమర్లు ఇబ్బంది పెడితే ఫ్లెక్సిలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు,కస్టమర్లకి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్,నర్సాపూర్,రామాయంపేట సిఐలు రంగక్రిష్ణ, జాన్ రెడ్డి, వెంకటరాజా గౌడ్, తూప్రాన్ డివిజన్ ఎస్సైలు శివానందం, లింగం, చైతన్యరెడ్డి,పోలీస్ సిబ్బంది తదితులున్నారు.

## ఎంపీ రఘునందన్ ను పరామర్శించిన బండి సంజయ్



**హైదరాబాద్ ( ప్రజాస్వరం ) :** మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును గురువారం సాయంత్రం ఆయన నివాసంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిసి పరామర్శించారు. శస్త్ర చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ ఇంటికి చేరుకున్న రఘునందన్ రావు ను ఆయన కలిసి ఆరోగ్య బాగోగులపై అడిగి తెలుసుకున్నారు. ఫోన్ కాల్ బెదిరింపులు, పార్టీ విషయాలపై కూడా కొద్దిసేపు చర్చించినట్లు సమాచారం.

## హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

ప్రారంభించడమే కాకుండా, స్థానిక అభివృద్ధి, ఉపాధికి ఇది కొత్త దారి చూపుతోందని అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో విశ్వసనీయ పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని కొనియాడారు.మహేశ్వరం ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో.. "ఫోర్త్ సిటీ – భారత్ ఫ్యూచర్ సిటీ" నిర్మాణాన్ని కూడా ప్రకటించారు సీఎం. దీనిద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు లక్షలాది ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా వాటి ద్వారా ఆ పెట్టుబడిదారులకు లాభదాయకత కూడా కలగాలి అనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు, పారదర్శకత అందిస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

## 500 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా బెదిరింపులు

అప్పుడు మీ ఉత్పత్తులపై 500 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తాం" అని చెప్పారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లును ఆమోదించినట్లు గ్రాహమ్ వెల్లడించారు. ఈ బిల్లుకు ఇప్పటికే 84 మంది సెనేటర్లు సంతకం చేశారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న వేళ ట్రంప్ బెదిరింపులకు దిగారు.ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలైన తర్వాత ఆ దేశంపై అమెరికా, పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా చమురుకు డిమాండ్ తగ్గిపోవడంతో తక్కువ ధరకే విక్రయించడానికి రష్యా ముందుకొచ్చింది. ఈ చమురును రాయితీపై భారత్ దిగుమతి చేసుకుంటోంది. మే 2025 నాటికి, రోజుకి 1.96 మిలియన్ బ్యారెల్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. ఈ మార్పుతో రష్యా చమురు, భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో 1 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. ఇది అమెరికాకు అత్యంత ఆందోళనకర విషయం కావచ్చు. కాగా, దీనిపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ "భారత్–అమెరికా సంబంధాల విషయంలో మేమే నిర్ణయం తీసుకుంటాం పాకిస్థాన్ కాదు" అని పేర్కొంటూ ఇటీవల భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాగా, ఈ బిల్లు అమెరికా పార్లమెంటులో మ దారి తీసే అవకాశమున్నా, భారత్ మాత్రం తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతల విషయంలో స్పష్టమైన దృక్కోణాన్ని చూపించింది. అమెరికా సరైన దౌత్యపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా? లేక వాణిజ్య యుద్ధానికి దిగుతుందా? అనేది త్వరలో తేలనుంది.

## భారత రక్షణ రంగం బలోపేతం దిశగా కీలక ముందడుగు

ఉన్న మన రక్షణ ఉత్పత్తి, ఇప్పుడు రూ. 1.46 లక్షల కోట్లను దాటింది. అదే విధంగా, రూ. 600–700 కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు నేడు రూ. 24,000 కోట్ల రికార్డును అధిగమించాయి" అని ఆయన వివరించారు. దేశ భద్రతకు, శ్రేయస్సుకు 'మేక్ ఇన్ ఇండియా' విధానం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయాణంలో 16,000కు పైగా ఎంఎస్ఎంఈలు భాగస్వాములై లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు

## నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా

కలుపుకుపోవాలనే ఉద్దేశంతో కూల్‌గా ఉంటున్నానని తన ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. చొక్కా గుండీలు విప్పి అడ్డగోలుగా బూతులు మాట్లాడితే మాస్ లీడర్ కాదని సిద్ధాంతాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లగలిగిన వారే అసలైన నాయకులని అన్నారు. ఆ నమ్మకం, సంకల్పం తనకు ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ పార్టీలో ఎలాంటి విభేధాలు లేవని అందరం కలిసికట్టుగానే పని చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ ట్విట్టర్ పార్టీ అని దానితో ఎవరికీ ఉపయోగం లేదని విమర్శించారు. తమ పోటీ ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే ఉంటుందని రాంచందర్ రావు పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కోవర్టులు

అన్నారు కొండా మురళి. కడియం శ్రీహరి అక్రమ మైనింగ్ చేస్తున్నారని మరోసారి ఆరోపించారు. తాము మాత్రం ప్రజల కోసమే పని చేస్తున్నామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌ను బతికించడమే తమ ఉద్దేశమని అన్నారు కొండా మురళి. లోకల్ బాడీ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలో అన్ని కాంగ్రెస్ గెలిచేలా పని చేస్తామన్నారు. ఎమ్మెల్సీగా ఎవరికి అవకాశం ఇచ్చినా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను గెలిపించే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో గెలుస్తామని అన్నారు కొండా మురళి. ఎవరికీ భయపడేది లేదన్నారు. రేవంత్‌ను పదేళ్లు సీఎంగా చూడాలనుకుంటున్నామన్నారు. ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీని చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు తెలిపారు. వరంగల్‌లో జరుగుతున్న రాజకీయాలు మీనాక్షి నటరాజన్‌కు వివరించామన్నారు. ఎవరికీ భయపడేది లేదన్నారు. విబేధాలు ఎవరితో లేవని తేల్చి చెప్పారు.ఎక్కడ గ్రూపులు లేవో చెప్పాలని మీడియాను ప్రశ్నించారు. మీడియాలోనే గ్రూప్లు ఉన్నాయని కదా అని అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే" నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా, బీసీలకు న్యాయం చేస్తున్నా, రోజుకు 500 మందికి భోజనం పెట్టి వారికి సాయం చేస్తున్నా, నేను జనంతోనే ఉన్నా, నేను ఏ నియోజకవర్గం తిరగను, కొండా సురేఖ నియోజకవర్గం మొత్తం కూడా తిరగను. నేను ఇంట్లోనే ఉండి కలుస్తాను. అణగారిన వర్గాలు ఓ బలవంతుడి దగ్గరకు వస్తాయి. బీసీలో బలవంతుడు ఎవరని భావిస్తే అక్కడేకికే వాళ్లు వస్తారు. వారి సమస్యలు తీర్చేందుకు నేను ముందుంటున్నా, నేను ఎవరికీ భయపడను. కుమార్తె రాజకీయంపై కొండా మురళి స్వరం కాస్త తగ్గించినట్టు కనిపిస్తోంది. ఆమెకు నచ్చినట్టు నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. తన కుమార్తె విషయంలో ఇప్పుడే ఏం చెప్పలేమని అన్నారు. కానీ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో పని చేస్తామని అన్నారు. "నేను ఓ కారులో తిరుగుతా, కొండా సురేఖ మరో కారులో తిరుగుతారు, నా కూతురు మరోకారులో తిరుగుతారు. ఎవరి ఆలోచనలు వారివి పరకాల నియోజకవర్గం నుంచి పోటీ అనేది మా ఇష్టం. లండన్ నుంచి వచ్చిన మా పాప ఏం చేస్తుందో ఆమె ఇష్టం. నాకు ఏం తెలుస్తుంది. సురేఖ 15 ఏళ్లు పరకాల ఎమ్మెల్యేగా పని చేసింది. అక్కడి గుట్టలు, పుట్టలు నాకు, నా కూతురుకు బాగా తెలుసు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం. బీసీల అభ్యున్నతికి పోటీ చేస్తాం" అని అన్నారు.


# నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

డిమాండ్ చేసింది. అయితే, అందుకు బీమా సంస్థ నిరాకరించడంతో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.దీనిపై విచారణ చేపట్టిన కర్ణాటక హైకోర్టు, రవిషా నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్టు తేల్చింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించలేదని నిర్ధారించింది. దీంతో నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణిస్తే, వారి కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోలేరంటూ తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. కానీ, అక్కడ కూడా వారికి చుక్కెదురయ్యింది. రవిషా కుటుంబం పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, ఆర్ మహాదేవన్లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే దానికి బీమా సంస్థ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమ తప్పిదం వల్ల జరిగే ప్రమాదాల్లో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు బీమా కంపెనీలు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. సరిగ్గా పదకొండేళ్ల కిందట జూన్ 18, 2014లో రవీష్ తన కుటుంబసభ్యులతో కలిసి ఫియట్ లీనియా కారులో మల్లసంద్ర నుంచి ఆరిసికెరెకు ప్రయాణిస్తున్నాడు. అయితే, అతడు, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి అధిక వేగంతో కారు నడిపాడు. నియంత్రణ కోల్పోయి కారు రోడ్డుపై పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ఈ ప్రమాదం రవీష్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. "పరిహారం కోరితే, మృతుడు స్వయంగా ప్రమాదానికి బాధ్యుడు కాదని నిరూపించాలి. అదే విధంగా అతడి బీమా పాలసీలో కవరేజ్ ఉందని చూపించాలి" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మృతుడి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ప్రమాదం జరిగినట్టు స్పష్టమైందని, అతడు తనకు తానే హానికరమైన చర్యకు పాల్పడ్డాడని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అటువంటి పరిస్థితుల్లో బీమా సంస్థకు బాధ్యత ఉండదని కోర్టు తేల్చింది.

# లారీని ఢీ కొన్న కారు...

## ఫిల్మ్ నగర్ ఎస్సై మృతి

### ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిన ఎస్సై రాజేశ్వర్



**సంగారెడ్డి** చెర్యాల గేటు దగ్గర లారీని కారు ఢీకొన్న ఘటనలో ఫిల్మ్ నగర్ ఎస్సై రాజేశ్వర్ మృతి చెందారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు నిర్వహించి తిరిగి వస్తుండగా ఘటన జరిగింది. ఎస్సై రాజేశ్వర్ స్వస్థలం సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ. వారం రోజుల క్రితమే హైదరాబాద్లోని ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు. మూడు రోజుల నుండి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద విధి నిర్వహణలో ఎస్ఐ రాజేశ్వర్ వున్నారు. మృతుడు 1990లో పోలీస్ శాఖలో ఉద్యోగంలో చేరాడు. అర్ధరాత్రి సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదంలో గాయపడ్డ ఎస్సై రాజేశ్వర్ ను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేస్తుండగానే మృతి చెందారు.

PRAJASWARAM తెలుగు దినపత్రిక

హైదరాబాద్ శుక్రవారం 4, జూలై 2025

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

## బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలి

**- ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్**



**మెదక్ జూలై 03 (ప్రజా స్వరం)** బదిలీ లతో కూడిన ప్రమోషన్ లు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, డిమాండ్ చేశారు.మెదక్ పట్టణంలోని వివిధ పాఠశాలలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలన్నారు. లేనట్లయితే సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు, అదే విధంగా టీ జి జే ఎ తో కుదిరిన ఒప్పందం మెరకు పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు ప్రతి నెల రూ 700 కోట్లు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు దిలీప్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, జిల్లా బాధ్యులు భూపతి గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలకృష్ణ, అరుణ్ కుమార్, నరేష్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మేడ్చల్ తహసీల్దార్‌గా వి.భూపాల్



**మేడ్చల్. (ప్రజాస్వరం) :** మేడ్చల్ నూతన తహసీల్దారుగా వి. భూపాల్ గురువారం తన కార్యాలయంలో పదవి భాద్యతలు చేపట్టారు. మొన్నటి వరకు సంగారెడ్డి జిల్లా న్యాలకల్ మండలం తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయనను మేడ్చల్ మండల తహసీల్దారుగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే మేడ్చల్ తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన వి.భూపాల్ గతంలో బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్ తహసీల్దార్, మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో పలు సెక్షన్లకు ఇంచార్జ్ గా పని చేసి ఎలక్షన్ విధులలో భాగంగా సంగారెడ్డి జిల్లా న్యాలకల్ మండలంలో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల, ప్రజల మన్ననలు పొందారు.

# ఈ నెల 13న పాటల పల్లకి భారీ ఏర్పాటు

▶ గత ప్రభుత్వం కళాకారులను గుర్తించలేదు ▶ కళాకారుల ఉద్యోగుల్లో అవకతవకలు జరిగాయి
▶ తెలంగాణ ఉద్యమ కవి గాయకులు, భాషా సాంస్కృతిక శాఖ మండలి సలహాదారులు నేర్నల కిషోర్
▶ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కళాకారులు







**మెదక్ జూలై 03 (ప్రజా స్వరం)** ఈ నెల 13 వ తేదీన మెదక్ టీఎన్జీవో భవన్లో పాటల పల్లకిలో 12 గంటల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమ కవి గాయకులు, భాషా సాంస్కృతిక శాఖ మండలి సలహాదారులు నేర్నల కిషోర్ తెలిపారు. గురువారం మెదక్ టీఎన్జీవో భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన పాటల పల్లకి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ను తెలంగాణ కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 తేదీన ఉదయం 10 గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఇందుకు ముందు ఉదయం మెదక్ రాందాస్ చౌరస్తా నుండి టీఎన్జీవో భవన్ వరకు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ఉత్తి పడేలా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తెలంగాణ రాష్ట్ర సాధనలో కాలికి గజ కట్టి పల్లె పల్లె న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతను ప్రజల్లోకి పాటల ద్వారా తీసుకుని వెళ్లడంలో కృషి చేసిన వారికి గత ప్రభుత్వం లో న్యాయం జరగలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం సాంస్కృతక సారధి ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా 550 మంది కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని అందులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయన్నారు. ఎంత జరిగినా గత ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తైనట్లు వ్యవహరించాలన్నారు. గత పదేళ్ల పాలన లో కళాకారులను అణిచివేసే ధోరణి లో వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే మిగిలిపోయిన ఉద్యమ కళాకారులకు సారధి సంస్థలు ఉద్యోగాలు పెంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం కాకుండా మేనిఫెస్టో లో పెట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర గడిచిందని, ఇప్పుడు ఉద్యోగాలు ఇచ్చి కళాకారుల కన్నీరు తుడిచి అన్నం పెట్టాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఉద్యమకారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కాంగ్రెస్ పార్టీ సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రాగన్న, మెదక్ జిల్లా ఉద్యమ కళాకారులు అధ్యక్షులు గుడాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అల్లీపూర్ రమేష్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మద్యల నర్సింలు, కళా ప్రసాద్, గ్యార యాకన్నా చీకోడ్, సాయిలు, సంగారెడ్డి జిల్లా కళాకారులు రాము, జమ్మికుంట ప్రభాకర్, కల్వకుంట్ల స్వామి, శేఖర్ చారి, భూమయ్య, పాపయ్య, అల్లారం ప్రేమ కుమార్, జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

# సీఎస్ఐ ఉచిత వైద్య శిబిరం






**మెదక్ జూలై 03 (ప్రజా స్వరం)** మెదక్ పట్టణంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో గల మిషన్ హాస్పిటల్లో గురువారం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే వారికి అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెదక్ ప్రెస్బిటరీ ఇంచార్జి శాంతయ్య మాట్లాడుతూ పేదవారికి ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఈ యొక్క ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు జైపాల్, సీఎస్ఐ సంఘ సభ్యులు జ్ఞాన ప్రసాద్ రావు, గంట సంపత్, బిట్ల నోబెల్ సాన్, జాన్ లివింగ్ స్టోన్, హ్యాండ్ ఆఫ్ హోప్ ఇంచార్జీ జయరాజ్, గెలేన్ చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎంపీ రఘునందన్ రావు



**వర్గల్ / గజ్వేల్ ( ప్రజాస్వరం )** మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రతిక్షణం నమ్మినవారికి సేవలందించేందుకు ఎప్పుడు ముందుంటాడని వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి అన్నారు. మైలారం గ్రామానికి చెందిన ఎర్రవాడ ప్రవీణ్ కుమారుడు నిమోనియా వ్యాధితో ఆసుపత్రిలో చేరడం జరిగింది. మెరుగైన వైద్యం ఖర్చుల నిమిత్తం సీ ఎం ఆర్ ఎఫ్ కోసం ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకొని మూడు లక్షల 50 వేల రూపాయల చెక్కును మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును గురువారం కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎక్కడ కష్టం వచ్చిన అతని ముందుండి సమస్యల పరిష్కారానికి ఉన్న గొప్ప నాయకుడు ఎంపీ అని కొనియాడారు.

శస్త్ర చికిత్స చేయించుకుని డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న మరుసటి రోజు నుంచే ప్రజా సేవకు పూనుకున్నాడని అన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే వేరే ఎవరైనా విశ్రాంతి పేరుతో ఉంటారని కానీ ఎంపీ రఘునందన్ మరుసటి రోజు తెల్లవారుజాము నుండి పార్టీ శ్రేణులకు అందుబాటులోకి వచ్చాడని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కిర్రి బుచ్చిరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్ నాయకులు టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి బూత్ అధ్యక్షులు నర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

## ఈటలను కలిసిన సిద్దిపేట బీజేపీ నాయకులు



**గజ్వేల్ (ప్రజాస్వరం) :** బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను ఆయన నివాసంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ , గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాజేందర్ గారు గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లో రానున్న ఎన్నికల్లో బీజేపీ జండా ఎగరేసేందుకు కార్యకర్తలు కష్టపడి పని చెయ్యాలని సూచించడం జరిగించినట్లు గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ తెలిపారు. ఈటలను కలిసిన వారిలో నాగు ముదిరాజ్, పంజాల రాజు గౌడ్ తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**మేడ్చల్ ( ప్రజాస్వరం ) :** ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలందరికి నాణ్యమైన విద్య అందుతుందని ఇంటిగ్రేటెడ్ క్లీన్‌రూమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్(ఐక్లిన్ కంపెనీ) చైర్మన్ గోపి అన్నారు. గుండ్లపోచంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం సుమారు రూ.46 లక్షలతో పూర్తి చేసిన పనులను ఐక్లిన్ కంపెనీ ఎండి ఓకేజిమ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ కటామనేని గోపి మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నని గుర్తు చేశారు. సమాజానికి తమ వంతుగా సహకరంగా అందించాలనే



ఉద్యేశంతో గుండ్లపోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు గత 20 సంవత్సరాలుగా సహాయసహకారాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు అమరం మోహన్ రెడ్డి సూచనతో గుండ్లపోచంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కొన్ని సదుపాయాలు అవసరం ఉన్నాయని తెలుసుకొని ఐక్లిన్ కంపెనీ యాజమాన్యంతో చర్చించి సుమారు రూ.46 లక్షల నిధులతో పాఠశాలలో తరగతి గదులు, పాఠశాల ప్రగణంలో వేదిక షేడ్ నిర్మాణం, భోజనశాల, పూర్తి భవనానికి సుందరమైన రంగులు లాంటి సదుపాయాలు కల్పించడం జరిగిందని చైర్మన్ కతమనేని గోపి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మంచి నైపుణ్యం కలిగి ఉన్నారని విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు గొప్ప పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ క్లీన్‌రూమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండి ఓకేజిమ్, వైస్ చైర్మన్ మాధవరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, హెచ్ఆర్ గోపీచంద్, బిజెపి నాయకులు అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతీ, మున్సిపల్ అధ్యక్షుడు కవేరి శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ మార్కెట్‌లో 15 కిలోల కిన్నెరసాని చేప

పినపాక, పాల్వంచ మార్కెట్ గురువారం ఉదయం నుంచే సందడిగా మారింది. ఎప్పటిలా కాకుండా ఈ రోజు ఓ అరుదైన దృశ్యం ప్రజల దృష్టిని ఆకర్షించింది. కిన్నెరసాని నది నుంచి పట్టుకున్న ఏకంగా 15 కిలోల భారీ చేప ఒకటి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చింది. సాధారణంగా ఇంత పెద్ద చేపలు మార్కెట్లలో కనిపించడం చాలా అరుదు. ఈ భారీ చేపను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా, కాస్త దూరం నుంచీ ప్రజలు తరలివచ్చారు. కొందరు ఆశ్చర్యంతో చూస్తుంటే, మరికొందరు తమ సెల్‌ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీశారు.

# గణిత టీచర్‌గా మారిన మెదక్ జిల్లా కలెక్టర్

▶ విద్యార్థుల నమోదు శాతం పెరగాలి.. ▶ నాణ్యమైన భోజనం తో పాటు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యం
▶ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్... ▶ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్









**మెదక్ జూలై 03 (ప్రజా స్వరం)** విద్యార్థులను నమోదు శాతం పెంచాలని విద్యార్థుల భవిష్యత్ ప్రగతికి మార్గదర్శనం చేయడం వంటి పనులు ఉపాధ్యాయులు చేయవలసిన ముఖ్యమైన బాధ్యతలలో భాగమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి వసతులు విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యత, ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. 9వ తరగతి విద్యార్థులతో గణిత టీచర్ గా మారి గణిత పాఠాలు బోధించారు. దాదాపు 30 నిమిషాల పాటు గణితం ను ఎలా నేర్చుకోవాలి? ఎలా ఒడిసి పట్టాలి అని మెలకువలు నేర్పిస్తూ గణితం లో ఉన్న సిద్ధాంతాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధిస్తూనే సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను చెప్పలేని సమాధానాలను స్వయంగా విద్యార్థులకు బోధించారు.విద్యార్థులలో మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రేరణను కలిగించారు. విద్యార్థులకు మంచి ప్రోత్సాహాన్ని, వారు కృషి చేయడానికి, ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంక్షేమ కోసం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ యూనిఫామ్, టెస్ట్ బుక్స్ నోట్ బుక్స్ అందిస్తున్నామన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని విద్యార్థులు సంతృప్తితో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.కలెక్టర్ పాఠశాల సందర్శన సందర్భంగా ప్రధానోపాధ్యాయులను పిలిపించి పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వనరులు, గత సంవత్సరం తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

హైదరాబాద్ శుక్రవారం 4, జులై 2025


## రోడ్డు మరమ్మతులు చేయాలని నిరసన

మంచిర్యాల, కన్నెపల్లి మండల కేంద్రంలో రోడ్డు అవస్థల గురించి ప్రజలు రోడ్డు ఎక్కారు. ప్రజలు రోడ్డు మీదకి వచ్చి రోడ్డు బాగు చేయాలని నిరసన తెలిపారు. ప్రభుత్వ అధికారులు అదే గుంతల రోడ్లపై తిరుగుతున్నారు తప్ప పట్టించుకోవడం లేదనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో కూడా ఈదే పరిస్థితి అని వర్షాకాలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిరసన తెలిపారు.

## సీఎం ఆర్ ఎఫ్ చెక్కు పంపిణీ



బెల్లంపల్లి, బెల్లంపల్లి మండలంలోని బుచ్చయ్య పల్లి గ్రామపంచాయతీలో దేవ దుబ్బయ్యకి రూ. 32, 000 విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాడి మహేష్ అందజేశారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చెక్కును పంపిణీ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదల పాలిట వరమని ఆయన పేర్కొన్నారు.

## ప్రధాన రహదారిపై రైతుల ఆందోళన

ఆసిఫాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం గురువారం ఉదయం 11 గంటల వరకు తెరుచుకోలేదు. దీంతో రైతులు ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఎస్ఐ వచ్చి అధికారులకు కాల్ చేసి సహకార సంఘం కార్యాలయంను తెరిపించడండో గొడవ సద్దుమణిగింది.

## నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేత

సిర్పూర్, కాగజ్‌నగర్ పట్టణంలో ఎల్లా గౌడ్ వాటర్ ట్యాంక్ వద్ద పంపింగ్ మెయిన్ పైప్ లైన్ లీకేజీ ఏర్పడిందని కమిషనర్ ఏ. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా వార్డు నంబర్లు 7, 8, 9, 10, 11, 21, 22, 23, 24 లలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపడుతున్నందున పై వార్డుల్లో నీటి సరఫరా పునరుద్ధరణకు ఇంకా 2 రోజులు పడుతుందన్నారు.

### ఆసిఫాబాద్: కాంగ్రెస్ సభకు

## కార్యకర్తలు తరలిరావాలి

చెన్నూర్, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జూలై 4న జరిగే రాష్ట్ర కాంగ్రెస్ బహిరంగ సభకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి కార్యకర్తలు భారీగా హాజరుకావాలని గురువారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి కార్యకర్తలతో మమేకం కావాలనే ఉద్దేశంతో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్ వంటి నాయకులు హాజరవుతారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని పల్లె ప్రకృతి వనం సమీపంలోని బోయినీ కుంట గుట్ట అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుళ్ళిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమయింది. గొర్ల కాపరులు చూసి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళలు ఎలాంటి సమస్య ఉన్న

## నిర్భయంగా సంప్రదించండి

వేములవాడ, విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే భరోసా ఇచ్చారు. జిల్లాలో షీ టీమ్ బృందం కళాశాలలో, పాఠశాలల్లో, విద్యార్థినిలకు గ్రామాల్లో పని చేసే ప్రదేశాల్లో మహిళలకు ఇవిటీజింగ్, పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

## నేతన్నల సంబరాలు

కరీంనగర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు చేసిన 33 కోట్ల రుణమాఫీపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### రాజన్న కోవెలలో

## చతుర్వేద స్మార్త పరీక్షలు ప్రారంభం

జగిత్యాల, శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వేద పాఠశాలలో చతుర్వేద స్మార్త పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయానికి సంబంధించిన శ్రీరాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు – వేద పాఠశాల ద్వారా మూడు రోజుల పాటు శ్రీరాజరాజేశ్వర అఖిలభారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామిజీ హాజరయ్యారు.

### జన్మదినం సందర్భంగా అన్నదానం

## నిర్వహించిన బెస్తపల్లి యువకుడు

రామగుండం, మంథని మండలం బెస్తపల్లి యూత్ కాంగ్రెస్ నాయకుడు ధర్మాజి సాయి కుమార్ జన్మదినం సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో అనాధ పిల్లలకు, వృద్ధులకు 50 మందికి గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువరు సాయి కుమార్ ను అభినందించారు. ప్రతి ఒక్కరు జన్మదినం సందర్భంగా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## అధ్వానంగా పోకలగూడెం ప్రధాన రహదారి



అశ్వారావుపేట, చంద్రుగొండ మండలం పోకలగూడెం ప్రధాన రహదారి 5 గిరిజన గ్రామాలను కలుపుతుంది. ప్రస్తుతం వర్షాలు మొదలైన నేపథ్యంలో ఈ మార్గం అధ్వానంగా మారిందని స్థానికులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు ఆగి బురదమయంగా మారిందన్నారు. గతేడాది ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు తాము ఎదుర్కొంటున్న సమస్యను తెలిపామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## మా బస్టాండ్ మాకు కావాలి

కొత్తగూడెం, దమ్మపేటలో మా బస్టాండ్ మాకు కావాలి అనే నినాదంతో స్థానికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం దీక్షలో భాగంగా మోకాళ్ళపై నిల్చోని అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా పెట్రోల్ బంక్ నిర్మించడం ఏంటని విమర్శించారు.

## ప్రజలకు డ్రగ్స్ పై అవగాహన

ఇల్లందు, కొత్తగూడెం మండలం రామవరంలో 2టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా చూడాలని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, యువత యాంటీ డ్రగ్స్ కి పూర్తిగా సహకరించాలని, యాంటీ డ్రగ్స్ ప్రోగ్రామును గ్రామస్థాయికి తీసుకెళ్లాలన్నారు.

## వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం, భద్రాచలం చిన్నజీయర్ మఠంలో గురువారం స్త్రీలకు గర్భకోశ వ్యాధుల ఉచిత పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్షల కోసం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వికాస తరంగిణి, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తుండగా.. నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.

## రహదారి మరమ్మతులు చేపట్టాలని ధర్నా

ములుగు, వెంకటాపురం మండలం శివాలయం కంకల వాగు వద్ద గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వెంకటాపురం నుండి భద్రాచలం వెళ్లే మార్గంలో రహదారి మరమ్మతుల సరైన మార్గం లేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపి వేశారు. భద్రాచలం వెంకటాపురం రహదారిపై ప్రేవేట్ వాహనాలు తిరుగుతున్న ఆర్టీసీ అధికారుల నిర్లక్షయం వల్ల బస్సు సర్వీసులు అధికారులు నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాస్తారోకో నిర్వహించారు.

### పిల్లలకి సేవాభావం

## చిన్నతనం నుండే నేర్పాలి

డోర్నకల్, మానుకోట జిల్లాకు చెందిన యువ నాయకుడు రాజశేఖర్ తన టీమ్‌తో కలిసి గురువారం ఉదయం హన్మకొండలో భద్రకాళి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో 200 భోజన ప్యాకెట్లు భిక్షాటకులు, అనాథలు, రోడ్లపై నివసించే నిరాశ్రయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాభావం యువతలో పెరగాలని, చిన్నప్పటినుంచి పిల్లల్లో దానం చేసే మనసు అలవరచాలని వారు సూచించారు. ప్రభుత్వం ఇలాంటి వారిని ఆదుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్ తో అన్ మ్యాన్డ్ కార్మికుడు మృతి

మహబూబాబాద్, మహబూబాబాద్ జిల్లాలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అన్ మ్యాన్డ్ కార్మికుడు కరుణాకర్ రెడ్డి గురువారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి ల విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అంగరంగ వైభవంగా

## భద్రకాళి శాకాంబరి నవరాత్రి ఉత్సవాలు

వర్ధన్నపేట,: వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో అంగరంగ వైభవంగా శాకంబరి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా నేటితో 8వ రోజు కు మహోత్సవాలు చేరాయి. గురువారం ఉదయం ఉగ్రప్రభా క్రమం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు, అమ్మవారి దర్శనార్థం ఆలయానికి చేరుకుని మొక్కులను భక్తులు సమర్పిస్తున్నారు.

### పాఠశాల యాజమాన్యంపై

## చర్యలు తీసుకోవాలని ధర్నా

జనగామ,: మహబూబాబాద్ జిల్లాలో ఎలాంటి పర్మిషన్ లేకుండా శ్రీ చైతన్య పాఠశాల నడిపిస్తు, పాఠశాలలో పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతు విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గురువారం పాఠశాల ముందు బైఠాయించిన డిఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

## పొంగి ప్రవహిస్తున్న పాకాల వాగు నిలిచిన రాకపోకలు

పాలకుర్తి, : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో గురువారం పాకాల యేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. పాకాల ఏరు ప్రవాహంతో గార్ల మండల కేంద్రం నుంచి రాంపురం, మద్దివంచ, కొత్త తండా, గుండ్రాతిమడుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్నో ఎండ్ల గా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేసిన ఆచరణలోకి రాలేదు. ప్రతి యేడు ప్రయాణికులు ప్రమాదాల బారీన పడుతున్నారు.

## అరుణాచలానికి స్పెషల్ టూర్ బస్సు సౌకర్యం



నారాయణఖేడ్, : నారాయణఖేడ్ నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి స్పెషల్ టూర్ బస్సు నడుపుతున్నట్లు డీఎం మల్లేశం గురువారం తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా జూలై 8న ఖేడ్ నుంచి సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు బయలుదేరుతుందని చెప్పారు. ఒక్కరికి ఛార్జ్ రూ. 4500 ఉందన్నారు. ఈ టూర్లో కాణిపాకం, వేలూరు, అరుణాచలం, జోగులాంబ పుణ్యక్షేత్రాలు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా జగన్నాథ రథయాత్ర




పటాన్‌చెరు,: రామచంద్రాపురంలోని ఎల్ఐజీలో జగన్నాథ రథయాత్ర కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి రథయాత్రలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జై జగన్నాథ అంటూ భక్తులు రథయాత్ర తాడును లాగారు. పాటలు పాడుతూ భజనలు చేస్తూ భక్తులు ముందుకు సాగారు.

## 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం



కూకట్‌పల్లి,: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా 31వ రోజు భువన్ యాప్ సర్వే ద్వారా అన్ని ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియను కమిషనర్ కిషన్ ప్రారంభించారు. అనంతరం కమిషనర్ ఆదేశాలతో వీధికుక్కల బెడదను తగ్గించేందుకు యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా కుక్కలను పట్టించి వ్యాక్సిన్ వేయించేందుకు ఏబీసీ సెంటరు తరలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పలు వార్డుల్లో పోగైన చెత్తాచెదారాన్ని తొలగించారు.

### గుమ్మడిదల మున్సిపాలిటీలో

## విద్యుత్ భద్రత వారోత్సవాలు

సంగారెడ్డి, : గుమ్మడిదల సబ్ డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన విద్యుత్ భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిన్నారం, గుమ్మడిదల సెక్షన్ ల్లో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందికి గుమ్మడిదల ఏడిఈ దుర్గాప్రసాద్ భద్రత ప్రమాణాలకు సంబంధించిన కిట్లను అందజేశారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ సేవలను వినియోగదారులకు అందజేయాలని తెలియజేశారు.

## ప్రజా ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి



దేవరకద్ర, : దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలం నందిపేట, దాసర్ పల్లి గ్రామాలలో అడ్డాకుల ఉమ్మడి మండల సమన్వయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జి మధుసూధన్ రెడ్డి ఆదేశానుసారం పర్యటించారు. దాసర్ పల్లి గ్రామకమిటీ అధ్యక్షుడుగా ఆంజనేయులు గౌడ్ ను ఎన్నుకున్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికలో కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ గెలుపులకు కృషి చేయాలన్నారు.

## తండ్రిని పొడిచి చంపిన కొడుకు

వనపర్తి,: ఘన్‌పూర్ మండలం కోతులకుంటకు చెందిన కేతావత్ హనుమంతు కుటుంబం గచ్చిబౌలి ఎన్‌టిఆర్ నగర్‌లో జీవిస్తున్నారు. అతనికి ఇద్దరు కుమారులు రవీందర్, సంతోష్. హనుమంతు సొంతూరులోని భూమిని తాకట్టు పెట్టి రూ. 6 లక్షలు తెచ్చాడు. ఇందులో రూ. 2.5 లక్షలు రవీందర్ బెట్టింగ్‌లో పోగొట్టాడు. డబ్బుల విషయమై తండ్రి ప్రశ్నించగా, స్నేహితుడి దగ్గరికి తీసుకెళ్తానని చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, గంతలు కట్టి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు.


%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999